


# దూరతీరాలు

కథానిక

శేషగిరి ఎత్తుగావున్న చెరువుగట్టుమీద నిలబడి ఒక్కసారి తేరిపార జూచాడు. తను ఈ వూళ్ళో వుండగా ఈ గట్టు ఇట్లా వుండేదిగాదు. సాయంత్రమయ్యేసరికి వూరిమధ్య చెరువుగట్టున మిత్రులంతా చేరేవారు. ఇప్పుడు జనసమ్మర్దం లేకపోయేసరికి అక్కడక్కడ గడ్డిపరకలు మొలిచి ఎండిపోయాయి. అప్పటి స్నేహితులంతా ఇప్పుడెక్కడున్నారో? శేషగిరి గట్టుక్రిందకి దిగాడు. ఎండిపోగా చిన్నగుంటలో తలదాచుకున్న నీళ్లలో మట్టిగడ్డపడి బుడుంగుమని జీవిత సత్యాన్ని కళ్ళకు చూపించింది. చెరువులో తామరకాడలు ఎండిపోయినా ఒకదాన్నొకటి కౌగిలించుకునే వున్నాయి. ఇట్లాంటప్పుడు మిత్రబృందమంతా వుంటే పేకాట ఆడుకొనే పని! ఇప్పుడు రామరాజు, నరిసిగాడు ఎక్కడున్నారో? నరిసి పెళ్ళికి రమ్మని ఉత్తరం రాశాడు. తను ఎలాగూ రాలేదు! రామరాజు బెజవాడ లేబరాఫీసులో ఏదో పని చేస్తున్నాడని తెలిసింది. అదో చిత్రం! చిన్నప్పుడు తనూ, నరిసి, రామరాజు ఎంత అన్యోన్యంగా వుండేవాళ్లు. ఒక్కక్షణం ఎవరు లేకపోయినా చెప్పలేని బాధగా వుండేది. ఎవరికివాళ్ళకి తమలో ఎవరన్నా లేకపోతే చచ్చిపోతామేమోనన్నంత భయంవేసేది! అబ్బో ముగ్గురూ కలిసి ఎన్నెన్ని ప్లాన్లు వేసేవారో? ముగ్గురూ ఒక్కచోటే ఉద్యోగంచెయ్యాలనీ, ఒకే ఇంట్లో వుండాలని... ఇంకా ఏమేమిటో అనుకునేవాళ్లు. కాని తానింకా బ్రతికేవున్నాడే? అదంతా ఓ సహజసత్యం జీవితంలో! మానవుల్లో చిన్నతనంనించీ ప్రేమించే గుణం వుంటుందిగాబోలు. అటువంటిదే తరువాత స్త్రీపురుషుల మధ్య వుంటే ప్రేమంటారు. ప్రేమకిన్ని నామాంతరాలెందుకో శేషగిరికి అర్థంకాలేదు.

శేషగిరి చేతికందే దూరంలోవున్న లేత తామరాకును లాగి గుంటలో నీటిబొట్లు దానిపైన వేశాడు. నీరు రెండు రత్నాలుగా చీలిపోయి శేషగిరి కళ్ళల్లోంచి ఇద్దరు సత్యవతులు కనిపించారు. శేషగిరి తన మనస్సు తనకు తెలీకుండానే సత్యవతి సౌందర్యానికి దాస్యం చేస్తున్నందుకు తిట్టుకున్నాడు. ఛ!ఛ! ఏమిటీ తనకీ ఆలోచనలు, సత్యవతెవరు? తనెవరు? గట్టిగా మూసుకున్న నిశీధి తలుపులు తను తెరవాలని ప్రయత్నం చేస్తున్నాడు. శేషగిరి బలవంతాన మనస్సు తామరాకుమీదికి త్రిప్పాడు. తామరాకుపైనీళ్లురత్నాల్లాగానే మెరుస్తున్నాయిగాని వాటికి సౌందర్యానికిమల్లే శాశ్వతత్వంలేదు. ప్రపంచంలో అందానికీ, ఆనందానికీ, సౌందర్యానికీ, సుఖానికీ, ప్రేమకీ శాశ్వతత్వం కల్పిస్తే అప్పుడెలావుండేదో? అప్పుడు ఇంకో ప్రశ్న వచ్చేది. అలాగే సృష్టివుంటే శాశ్వతత్వం లేకుండా ఎట్లా వుంటుందోననే ప్రశ్నవచ్చేదిగాబోలు. లేనిదాని కోసమేగా మానవుడు ఏడ్చేది: మానవ నిఘంటువు ఈ ప్రశ్న అనే పదం తప్ప ఇంకేమీ లేవేమో! అడవుల్లో, చెట్టుతొర్రల్లో, కొండగుహల్లో నివశించే మానవజాతి నాగరికతా ప్రపంచాన్నేర్ప

తిరునగర్.

రచుకొని, నియమాలతో దాన్ని బంధించి ఆ ముడులు గట్టిపడేసరికి కొండగుహాలజీవితాన్ని గుర్తు తెచ్చుకొని అదెంత సుఖంగా వుంటుందో అనుకోవడం – ఏమిటో ఈ మనస్సుకి సరైనస్థాయి లేదు. ఒక్కొక్కప్పుడు హిమాలయశిఖరాగ్రాలపై విహరిస్తుంది. మరునిమిషంలో పాతాళగంగలో స్నానంచేస్తుంది.

విహరిస్తున్న మనస్సులా మేఘం ప్రయాణం సాగించింది. శేషగిరి తామరాకుమీద రెండు నీటిచుక్కల్ని క్రిందికివంచాడు. క్రిందపడి నేలలోకి ఇంకిపోయాయి. రత్నాలు మట్టిలో కలిసిపోయాయి. ఇందాక స్పష్టంగా కళ్ళల్లో మెరిసిన రత్నాలు...ఇప్పుడు రూపులేకుండా మట్టిలో కలిసిపోయాయి. సౌందర్యం ప్రకృతిలో కొంత వరకూ వుంది. కాని నిజమైన సౌందర్యం మనస్సులోవుంది. మనస్సు సౌందర్యాన్ని చూస్తుంది. మనస్సు ప్రోగుచేసుకున్నంత సౌందర్యం ప్రకృతిలో లేకపోవచ్చు. అనుభూతి అనుభవానికి ఎన్నో రెట్లు.

సత్యవతిలో తను అనుకున్నంత సౌందర్యం వుందా? తనకాప్రశ్న అనవసరం. మనస్సు నీక్కావలసినంత సౌందర్యాన్ని ప్రోగుచేస్తున్నప్పుడు ఈ బాహ్య ఇంద్రియాలతో తనకి పనేముంది? సత్యవతి తనకో అనుభూతి! ఆమెను చూస్తూ కూర్చోవడమే తనకో సంస్కారం. తనకు పూర్వ జన్మ వృత్తాంతం తెలిసినట్లుగా వుంటుంది. కాని శేషగిరి ఒక ప్రశ్న మాత్రం శేషప్రశ్న యిపోయింది. తాను దేనికి దాస్యంచేస్తున్నట్లు? సత్యవతికా? సత్యవతి యవ్వనానికా? యవ్వనానికి తాను దాస్యం చేస్తోంటే తను అంతగా బాధపడవలసిన అగత్యంలేదే? యవ్వనంకోసమే అయితే ఎంత మందిలేరు? సత్యవతి తనతో ఇంతవరకూ మాట్లాడ్లేదు. కాని ఆమె పాటల్లో ఎంత మాధుర్యం వుంటుందో దాన్ని మాటల్లోసహితం చూపించగలదు. అది తను మొదటిరోజునే తెలుసుకున్నాడు. సత్యవతి ప్రతివిషయాన్నీ నిశితంగా విమర్శిస్తుంది. ఆమెలో అంత విమర్శనాజ్ఞానంవుందనే విషయం తన తార్కికజ్ఞానాన్ని వెక్కిరించింది. తన కథల మీద తీవ్ర విమర్శ చెల్లెలితో చెయ్యడం తను విన్నాడు. తనకు ఆమెమీద కోపంరాలేదు. ఎందుకురాలేదు? అని ఆలోచించుకొంటే తనకు ఆశ్చర్యంవేసింది. శేషగిరి నవ్వుకున్నాడు. దేన్నించైతే తను తప్పుకోవాలనిప్రయత్నంచేస్తున్నాడో కేవలం దాంట్లో తను లాగబడుతున్నాడు. ఈ దౌర్బల్యం తనలో వుందన్న విషయం తెలిసేసరికి అతనికి తనమీద చెప్పలేనంత కోపం వచ్చింది.

శేషగిరి లేచి నిలబడి వెనవేపు చూస్తూ దులుపుకున్నాడు. ప్రొద్దువాలిపోతోంది! తను నడుస్తున్నకొద్దీ సూర్యుడు మరింత ఎర్రబడుతూ చుట్టూ అరుణకిరణాలు బాధతో మూలుగుతున్నాయి. ఈ క్షణంలో ఇక్కడ అస్తమించి ఇంకోప్రదేశంలో దర్శనమిచ్చే సూర్యుడికీ విశ్రాంతిలేక పోవడం శేషగిరికి బాధకలిగించింది. మనం ఒక్కొక్కప్పుడు ప్రయోజనంలేని విషయాలకోసం బాధపడుతూ వుంటాం. "సత్యవతికీ తనకీ సంబంధం లేదు" అనుకున్నప్పుడు గూడా అట్లాగే మనస్సు బాధపడుతుంది. సత్యవతిచేతిలో తనువీణ! ఆమె ఆ వీణని ఏవిధంగానైనా చెయ్యగలదు. వీణలన్నీ ఒక్కటేఅయినా ఒక్కొక్కరి చేతుల్లో అది విచిత్రస్వరాలు పలుకుతుంది. సత్యవతిగూడా అంతే! తన దైనికచర్య, తన స్వాభావికం తప్ప ఆమెలో ఏమీలేవు. అవే తన తంత్రులను మీటుతాయి! తనకు తెలియని స్వరాలు పలుకుతాయి! వాటినివిని తనలో ఆ స్వరాలు ఇమిడివున్నాయా? అని ఆశ్చర్యం కలుగుతుంది! ఆమెతో మాట్లాడాలని తనకు వుండదు! ఆమె మెడలో మెరిసేకాంతి, నవ్వినప్పుడు సొట్టలుపడే బుగ్గల్లో దాక్కున్న ముగ్ధ సౌకుమార్యం, పైదవడ చర్మం కళ్ళనుకప్పినప్పుడుట్టిపడే అమాయకత్వం-అన్నీ తననక్కడ నిలవేసి "మానించి తప్పించుకెళ్లు చూస్తాం" అని సవాలుచేస్తాయి! సత్యవతి సౌందర్యం తనకో విచ్చిన పువ్వులా కనిపిస్తుంది. దాన్ని ముట్టుకుంటే రేకలన్నీ రాలిపోతాయేమోనని తనలో భయం! తను సౌందర్యాన్ని చూచి ఆనందించగలడు గాని దాన్ని నశింప చెయ్యలేడు! అనుభవించడం సౌందర్యానికి క్షయమా? అసలు తనలో ఆ శక్తి లేదు! చిన్నప్పుడు నాన్న దూదితో చేసిన పక్షుల బొమ్మలు తెచ్చినప్పుడు ఎంతో అప్యాయంగా

పెట్టెలో పెట్టి దాచేవాడు. మళ్ళా తీసి చూసేసరికి పీచుపీచయిపోయేవి. తప్పెవరిది? ఎవరికంటా పడకుండా సంరక్షించి దాచడంలో తనకు మిగిలిందిగూడా ఏమీ లేకపోయింది.

ఇంటికి చేరి నూతిదగ్గర చన్నీళ్ళు స్నానం చేస్తున్నాడు. మునిమాపు చీకటి. చంద్రుడి ప్రక్క వెన్నెలలు వళ్ళువిరిచాయి. దిక్కుల్నించి ఆవరిస్తున్న చీకట్లని తరుముకున్నాయి స్వస్థానానికి. సత్యవతి బిందెపట్టుకొని నూతిదగ్గరికి వచ్చింది. శేషగిరి బొక్కెనతో ముఖంమీద నీళ్ళుపోసుకొంటూ దొంగతనంగా సత్యవతివంక చూచాడు. లేత ఎరుపుచీర కట్టుకుంది. నీళ్ళుతోడుతున్నప్పుడు బలహీనమైన నడుం విచిత్రంగా లాస్యం చేస్తోంది. సత్యవతివంక చూడ్డానికి తనకెందుకో అంతభయం? సంఘంలో అలవాటైన అలవాట్లన్నీ సహజగుణాలుగామారి స్వాభావికాలవుతాయి గాబోలు.

సత్యవతి హంసలా నడవగలదు. కాలేజీలో భాస్కర్రావు మేష్టారమ్మాయి అలా నడవడానికే ప్రయత్నం చేసేదిగాని అది అసహజంగానే కనపడేది. సత్యవతి సాయంత్రపు సూర్యుడు వెళ్ళలేక వెళుతున్నట్లుగా వెళుతోంది. స్త్రీలో సృష్టిని చలింపజేసేవి కొన్ని వున్నాయి. అవి వాళ్ల తమకు తాము తెచ్చుగుంటారో; ప్రకృతే వాళ్ళకాశక్తి నిచ్చిందో తెలీదు.

సత్యవతి రెండోసారి ఖాళీబిందె చంకన వేసుకుని వచ్చినప్పుడు తను వళ్ళుతుడుచుకుంటున్నాడు. ఈ సారి సత్యవతి నీళ్ళుతోడలేదు.

“మీరు కథలు రాస్తారటగా?” అని అడిగింది.

శేషగిరి ఉలిక్కిపడ్డాడు. తనువచ్చిన నెలరోజులపైనించీ ఆమె తనతో ఎన్నడూ మాట్లాళ్ళేదు. అకస్మాత్తుసంఘటనలు క్షణంసేపు తికమకపెడతాయి! సత్యవతితో అలాంటిపరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందని తనెప్పుడూ వూహించలేదు. చెట్లల్లో గాలిలేదు. తన మనస్సుకుమల్లే జడత్వం ఆవహించింది. సత్యవతి తననాప్రశ్న వేస్తే చెప్పవలసిన సమాధానంగూడా తనకు తట్టలేదు. ఇదివరకెప్పుడూ ఆలోచించుకోలేదు. తను రాసిన కథల్లో నాయకులంతా తనకుమల్లే ఆడవాళ్ళదగ్గర వెర్రిముఖంవేసి ఎప్పుడూ నిలబడలేదు. కథలో ఏ కథానాయికైనా నాయకుణ్ణి “నువ్వు కథలు రాస్తావుటగా?” అని సత్యవతికిమల్లే నిలవేసి అడిగితే? కథల విషయంవేరు! దానికీ వాస్తవానికీ పోల్చగూడదు. తను కథల్లోని పాత్రలమల్లే కాగలడా? సాధ్యంకాదు. కథల్లోనూ, పుస్తకాల్లోనూ సంఘంలో వునన్ని కట్టుబాట్లు, నీతినియమాలు అడ్డదార్లు వుండవు. అది తన స్వంతలోకం! తన ఇష్టంవచ్చిన కట్టుబాట్లు అవసరమనుకుంటే వుంటాయి, లేదనుకుంటే తీసేస్తాడు. కాని ఇక్కడో?

నిజంగా ఎవరైనా అమ్మాయి సత్యవతి తననడిగినట్లు “నువ్వు కథలు రాస్తావుటగా?” అని అడిగిందనుకో తనకథలో నే. అప్పుడతడేమంటాడు? బహుశా “అన్నికథలూ నీకోసమే” అంటాడేమో? అతనంత తేలిగ్గా తన బలహీనతను బయటపెట్టగలడా? ఈ స్త్రీముందు తను ఆమె సౌందర్యానికి పడిచస్తున్నానని చెప్పగలడా? అందరూ అడగడంవేరు. సత్యవతి అడగడంవేరు. వేరే యింకెవరైనా అడిగితే ఇంత ఇదిగా తను ఆలోచించేవాడు కాదేమో. సత్యవతి తనహృదయంలో నడిరోడ్డుమీద వేసినమంటు. అదిచూస్తే భయమో ఆవేశమో, అనురాగమో తను చెప్పలేడు! శేషగిరి దొంగతనంగా సత్యవతివంక చూచాడు. వుంగరాలు తిరిగిన జుట్టు తుమ్మెదలు ముసురుతున్నట్లు ముఖమంతా ఆవరించివుంది. వెన్నెల బుగ్గల్ని సున్నగా రాస్తోంది! సత్యవతి తనవంకే చూస్తోంది. ఆ కళ్ళల్లో తనకు పూర్వజన్మలూ, పరలోకాలూ, దేవతల నృత్యాలూ, ప్రకృతి సౌందర్యాలూ కనిపిస్తాయి! అవి సంఘపు కట్టుబాట్లనీ, అది కట్టుకున్న మట్టిగోడల్నీ అతిక్రమిస్తాయి! అప్పుడు తనెవరో తనకు తెలీదు. సత్యవతి చూపు తనలోని తీక్షణతకి ఓ నిరోధకశక్తి. తల వంచుకుని “ఆ” అనగలిగాడు.

సత్యవతి సన్నగా నవ్వింది. ఆ నవ్వులో ఏ విభావాలున్నాయో, ఏయేగూఢార్థాలున్నాయో విలువలేమిటో, అసలా సాంకేతిక భాషార్థాలు ఏ జాతి నిఘంటువులో వున్నాయో తనకర్థంకాదు.

“మీరు భలేవారే! మరి కథల్లో అలారాస్తారు కదా? సరిగా మాట్లాడ్డం గూడా చేతకాదన్నమాట” అంది.

ఈ నిశిత విమర్శ తన ఆత్మశక్తుల్ని, అభిమానాన్నీ వజ్రఘాతానికి గురిచెయ్యలేదు. సత్యవతి భాష తనకి విచిత్రంగా వుంటుంది. తనలో వున్న భావాల్ని సరైన భాషలో చెప్పగలిగిన సంస్కారం ఆమెలో లేదని తననుకున్నాడు. కాని ఆమెకంతకంటే ఎక్కువ సంస్కారమే వుంది. అది తననుకున్న దానికంటే ఉత్కృష్ట స్థాయిలో ఉందేమోగూడా! సత్యవతి తన ముఖములో ప్రస్ఫుటమయ్యే భావాల్ని గమనిస్తోంది. ఆడవాళ్లు బహువిచిత్రంగా లాలిస్తారు. వాళ్ళకు మనపైనవున్న జాలినిచూస్తే మనపైన మనకే జాలి కలుగుతుంది. సత్యవతి బిందె నింపుకొని చంకన వేసుకుంది. "మాట్లాడ్డం చేతకాదు గనకనే మనుషులు కథలు రాస్తారేమో?" అంది. శేషగిరి సత్యవతి కళ్ళల్లోకి చూచాడు. ఆమె చూపులు తన కళ్ళల్లో నిద్రపోతున్న వెలుగుల్ని మేలుకొలుపుతాయి. సత్యవతి వత్తి నెగతోసే పుల్ల. తనలో వున్న దీపశిఖను పెద్దదిచేసి ప్రజ్వలింపజేస్తుంది. ఇంద్రుడి ఆజ్ఞతో దేవగణమంతా తనముందు లాస్యం చేస్తున్నట్లుగావుంది. సత్యవతి తనముందు నుంచే బిందెతో వెళ్లిపోయింది.

ఆ మరుచటిరోజు సాయంత్రం తను ఇంటికి వచ్చేసరికి ఇంటికి తాళం వేసివుంది. అమ్మ "సాయంత్రం పెందరాళేరా! సినిమాకి వెళతాం" అని తనకు చెప్పినమాట ఇప్పుడు గుర్తొచ్చింది. సత్యవతి గుమ్మంలో కూర్చుంది. ప్రహరీదాటి యింటితాళం చూచాక గాని తను సత్యవతిని చూళ్ళేదు. ఆమె గుళ్ళో దేవత-అజంతా సుందరి-ద్వారంలో కేవలం అలాగే నిలబడివుంది.

"మీ అమ్మా, మా అమ్మావాళ్ళు సినిమాకు వెళ్ళారు." అంది సత్యవతి. తాళాలిచ్చి వెళ్ళిందేమో కనుక్కుందామనుకుంటున్నాడు. ఇంతలో తాళాలు బొడ్డులోనించి తీసి "ఇవిగో" అంది.

"మరి నువ్వెళ్ళలేదే?" అని అడిగాడు శేషగిరి.

"అంతా వెళ్లిపోతే మీరేం చేసేవారు?" సత్యవతి ప్రశ్నించింది.

ఆమె అవహేళనకు తనకు సమాధానం దొరకడం తేలికేమీ కాదు. తలుపుతీసి ఇంట్లోకి వెళ్ళినాడు. నాన్నగారు ఇంకో గంటా గంటన్నరకి గాని రారు. ఈమధ్య స్వయంగా వడ్డించుకొని భోంచేసే అలవాటు తప్పిపోయింది. వళ్ళంతా చిరాగ్గావుంది. స్నానంచెయ్యాలి. సబ్బు, తువ్వాలు వెతుక్కోవాలి. ఈ ఇంటిగొడవలు ఆడవాళ్లు లేకపోతే మహాయాతనగా తయారవుతాయి. ఆడవాళ్లలో దేవుడందుకేనేమో అంత సహనం పెట్టాడు. ఎంత వెతికినా సబ్బుపెట్టె కన్పించలేదు. ఒక్కపూటకు సబ్బు లేకపోతే మాత్రం ఏంపోయింది. అందులో తను బ్రహ్మచారి-బాధలేదు.

స్నానం చేస్తూవుండగా సత్యవతి ఆ వైపే వస్తోంది. వెన్నెల తనవేపు కదలివస్తున్నట్లుగా వుంది. తెల్లటి గ్లాస్కోచీర కట్టింది. పల్చటి పూలజాకెట్టు శరీరాన్ని బలంగా పట్టుకుంది. సబ్బుపెట్టె తెచ్చి నూతిపళ్ళెం అంచు మీద పెట్టింది.

"సత్యవతీ, మీ అమ్మ నిన్నొక్కర్తెనీ వదలి వెళ్లిందే? నీకు భయం వెయ్యదూ?" అన్నాడు.

"ఆమెకి నేనంత చిన్నపిల్లని కానని నమ్మకమేమో! దానికి తగినట్లు నాకెప్పుడూ భయం వెయ్యలేదు." సత్యవతితో తను అంత చనువుగా మాట్లాడడం ఇదే మొదటిసారి. ప్రక్కనున్న మల్లె పందిరిలోంచి మేలుకున్న సువాసనలు ఆ ప్రాంతాన్ని ఆవరించాయి. కొబ్బరిచెట్టు ఆకులు వెన్నెల రంగేసుకున్నాయి ఉపరి భాగాన. "తను సత్యవతిని ప్రేమించడం లేదుకదా?" అతనికి అకస్మాత్తుగా తట్టింది. అసలు ప్రేమించేది దేన్ని, కనిపించే భౌతికదేహాన్నా, కన్పించని ఆత్మనా? ఆత్మకాదు. అవటానికి వీల్లేదు. సత్యవతి మగాడైతే? తను ఆమెనలా చూడగలిగేవాడా? కనిపించని ఆత్మని ఎలాగూ ప్రేమించలేవు. నీవు ఆరాధించేది అందాన్ని, ఆ అందం శరీరంది. ఆత్మకేమీ సంబంధంలేదు. కనుక ప్రేమించేది శరీరాన్ని మాత్రమే! అయితే కామానికీ దానికీ తేడా ఏముంది? ప్రేమ ఇంటిముందు గులాబీ మొక్కలువేసి పెంచడం లాంటిది...కామం దాన్ని పీకి ఎండబెట్టి దొడ్లో కంచెవెయ్యడం లాంటిది. కామం అనుభవం-ప్రేమ అనుభూతి!

"కథలు ఆలోచిస్తున్నారా?" అంది సత్యవతి.

"అవును. నీ మీదనే!" అన్నాడు శేషగిరి. ఎందుకలా అన్నాడు? సమాధానం తనకి దొరకనే

లేదు. ఏదో లోపల్నుంచి ఓ గాఢమైన శక్తి ముందుకు నడిపిస్తోంది. తన విషయాలు తనే చూచుకోవాలి. ఇతరులెవరూ రారని తెలిసినపుడే నిజమైన ధైర్యం వస్తుంది గాబోలు.

"నిజంగానా? ఎలా విమనిరాస్తారో చెప్పండి." అంది సత్యవతి. తరువాత ఫక్కున నవ్వింది. పెదవులు విడిపోయి బుగ్గలు ప్రక్కలకెళ్ళాయి.

"రాశాననుకో! ఏంచేస్తావు?" అని అడిగాడు శేషగిరి. కాని ఆమెతోపాటు తనూ నవ్వలేక పోయాడు.

"దావావేస్తాను ఆఁ" అంది మళ్ళా నవ్వుతూ.

చంద్రుడు వెన్నెలంతటినీ సత్యవతి నోట్లో నించి బయటికి విడుస్తూ కాంతి తగ్గిపోతున్నాడు.

సత్యవతి అకస్మాత్తుగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది. దానికి కారణం ఆలోచిస్తూ వుండగానే ఇంట్లో చప్పుడు వినిపించింది. వాళ్ళ నాన్న వచ్చాడు. ఆడవాళ్ళకు గిరీశంగారన్నట్లు భవిష్యత్తును తెలుసుకొనే విద్య తెలుసు గాబోలు: నాన్న, అమ్మా వాళ్ళొచ్చేముందుగాగాని రాలేదు. అప్పటివరకు శేషగిరి రేడియో పెట్టుకొని కూర్చున్నాడు. అమ్మ తను వచ్చేంతవరకూ భోంచెయ్యకుండానే వున్నందుకు నొచ్చుకుంది. భోజనం చేసి నడుం వాల్చినా నిద్రపట్టడంలేదు. నరాల బాధ రక్తపుపొంగు, ప్రకృతి తనపై కట్టిన కత్తి తనకు నిద్ర రానివ్వవు! ఇంకా సినిమాహాలు రికార్డులు వినిపిస్తునే వున్నాయి. తనకి దొడ్లో మంచం వెయ్యమని అమ్మకు చెప్పి బయలుదేరాడు.

తను తిరిగి వచ్చేసరికి ఒంటిగంట అయింది. నాన్న వరాండాలో పండుకున్నాడు. ఆయనకు యెంత ఉక్కపోస్తున్నా బయట పడుకొనే అలవాటులేదు. తలుపుతీసి చొక్కావిడిచి కొంకెకు తగిలించి దొడ్డితలుపు తీశాడు. అమ్మకి చెరో ప్రక్కా రెండు మంచాలమీద తమ్ముళ్ళూ, చెల్లీ పండుకునివున్నారు. విరగ్గా ఒక మామిడిచెట్టులా వుంది అమ్మ! ప్రక్కనే నాలుగయిదడుగుల దూరంలో సత్యవతి మంచంమీద పండుకుంది. వాళ్ళమ్మ మంచం ఎక్కడో దూరాన వుంది. తండ్రి ఇంట్లో పండుకున్నాడల్లే వుంది. తను తలుపు తియ్యడం చప్పుడెవరైనా విన్నారేమోనని అటూ ఇటూ తిరిగి చూచాడు. సుషుప్తి సుఖస్వప్నాల్లో యెవ్వరికీ ఆ విషయం అవసరం లేనట్లుగా వుంది.

సత్యవతి సోగకన్నులు సున్నితంగా మూతలు పడివున్నాయి. తెల్లటి గ్లాస్కో చీర గాలి తెరకు కదులుతో వుంటే సరస్సులో గాలి తాకిడికి అలలు చలించినట్లుగా వుంది. బలహీనమైన నడుము చీర కౌగిలిలో నలిగిపోతున్నట్లుగా వుంది. అనంతమైన సముద్రపునురుగు, లోకాలనన్నిటినీ ముంచేస్తున్నట్లుగా వుంది. ఎడమకాలు మడిచి కుడి కాలుమీద పెట్టుకుంది. దిండుమీద చేయిమడిచి మెడ ఆనించింది. ఒకప్రక్కకు తిరిగి నిశ్చలంగా నిద్రపోతోంది సత్యవతి! వెన్నెల పొత్తికడుపు మీదపడి మెరుస్తోంది. ఎవరన్నా నిద్ర లేస్తారేమోనని తనకి భయం. గుండెదడ-నిద్రపోతున్నా సంఘమంటే భయంపోదు. అసలు మానవులు తప్పుల్ని చెయ్యకపోవడం స్వతహాగా కాదు; సంఘం చూస్తుందేమోనని భయం. శేషగిరి గబగబా వెళ్ళి అమ్మ మంచంమీద నడుంవాల్చాడు!

రెండోరోజు నాన్న "మరి నువ్వు కాలేజీకి వెళ్ళేదెప్పుడు?" అని అడిగాడు.

"వచ్చే సోమవారం బయలు దేరుతాను" అన్నాడు శేషగిరి.

"ఇది ఫైనలియరని గుర్తుంచుకొని చదువు" అన్నాడు నాన్న. అంతవాడైంతరువాత తనకా విషయం చెప్పాలా? ఏదో ఆయన ఆపేక్షగానీ-తనకు తెలీదూ?

"సత్యవతీ! వెళ్తున్నా" అన్నాడు శేషగిరి.

"ఎప్పుడు" అంది.

"ఇంకా నాలుగురోజుల్లో"

"సరే-మంచిదేగా!" అంది. శేషగిరి మనస్సు చివుక్కుమంది. తనకెందు కాబాధ? సత్యవతి దగ్గర్నించి "సరే! మంచిదేగా" అనే మాటకంటే ఇంకా ఎక్కువేదో తనాశిస్తున్నాడు. అతనింకా సత్యవతితో మాట్లాడాలనుకున్నాడు. కాని ఆమె అక్కడలేదు. నాలుగోనాడు శేషగిరి పెట్టె, బెడ్డింగులతో బండిలో ఎక్కి సందు దాటిపోయే వరకూ ఇంటివరకూ చూస్తూనేవున్నాడు.

తండ్రి తనని అర్జంటుగా బయలుదేరి రమ్మని టెలిగ్రాం ఇచ్చేసరికి గుండె చేత్తోపట్టుకొని పరిగెత్తాడు. తండ్రి స్టేషన్‌కి వచ్చాడు. ఘోర గంభీరముద్ర నాన్న ముఖాన చూచేసరికి గిరి తనేమీ మాట్లాడ్లేకపోయాడు సాహసించి!

“ఏమిరా! ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చావుట” అన్నారు నాన్న ఇంటికి వెళ్ళేదార్లో.

“ఏ అమ్మాయికి” అమాయకంగానే ప్రశ్నించాడు శేషగిరి.

“అదే! మన ప్రక్కవాటా అద్దె కివ్వలా! జగన్నాథంగారమ్మాయికి. ఇంత చదివినందుకు నన్నుద్ధరించొద్దూ మరి. నా పేరు బయటి కెలా రాను నీవంటి కొడుకు లేకపోతే!” అంటున్నాడాయన.

“అసలు విషయం తెలీకుండా అలా అంటే ఎలా నాన్నా” అన్నాడు శేషగిరి.

“విషయం కొత్తగా తెలిసేదేముంది. నువ్వన్న రెండుసెల్లల్లోనూ చేసినపని అంత క్రొత్త దెలా అవుతుంది” అన్నాడు నాన్న. ఆయన ఎప్పుడూ అంతే. ఆవేశంవస్తే మాట్లాడే విషయానికి అర్థం వుండదు.

“అసలు ఏం జరిగింది నాన్నా” అన్నాడు శేషగిరి.

“ఆ అమ్మాయికి, జగన్నాథంగారి కూతురికి నువ్వు పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చావుట. ఆ అమ్మాయి నిన్నే చేసుకుంటానని కూర్చుంది” అన్నాడు.

“నన్నా?” అన్నాడు శేషగిరి తనకి అలా మాటిచ్చినట్లెక్కడా గుర్తులేదు. నాన్న మెదలకుండా వూరుకోలేదు.

“నీకేం. నువ్విప్పుడు అలాగే చేస్తావు. కాని తరువాత తరం విషయం ఆలోచించు...”ఇంకా ఏమేమిటో అంటున్నాడు.

సత్యవతికీ, తనకూ వివాహం సంభవంకాదని తనకూ తెలుసు. సంఘ నియమాలూ, కట్టుబొట్లు, సంఘనీతి, సువర్ణ నిగళనాదాలు తన కళ్లెదుట మెరుస్తున్నంతసేపూ తను అలా మాట ఇచ్చి వుండడు. తను సంఘంలో మనిషి. సంఘం నాటిన మట్టి విత్తనాల్లోంచి తను పెరిగాడు. ఇప్పుడు తను దాన్నెదిరిస్తానంటే సంఘం వూరుకోదు, రెండు మొట్లుమొట్టి క్రిందికితోస్తుంది. ఆ తోపుతో హిమాలయపు కొండలమధ్య పారే సెలయేళ్లల్లోపడి దాంతోపాటు గడ్డకట్టిపోతాడు. అసలు సంఘం తన సభ్యుల్నించి “ప్రేమ”ను తీసెయ్యాల్సింది. ప్రేమించే గుణం వున్నంత కాలం సంఘానికి ఎప్పటికైనా ముప్పొచ్చే అవకాశం వుంది.

“ఆ అమ్మాయిమీద నీకు ప్రేమేమిట్రా?” అన్నాడు నాన్న. “నిజమే తను ప్రేమిస్తున్నానని సత్యవతితో చెప్పాడా! లేదే. ఆమె ఓ అందమైన పుష్పం.ఆకుసుమసౌందర్యాన్ని తను ఆరాధిస్తాడు. అది తనొక్కడి హక్కే కాదేమో! సత్యవతి అలా చెప్పడంలో వుద్దేశం ఏమిటి? తను అనని మాటను అన్నానని చెప్పి తన నబద్ధీకుణ్ణిచేసింది. శేషగిరికి సత్యవతిమీద కోపంవచ్చింది. తన మనస్సులో నలుమూలల్నించీ కారుమేఘాలు దట్టంగా పట్టాయి. తన మెదడు మంచుగడ్డలా కరిగి పోతోంది. సత్యవతిని తను ఏ దృష్టితో చూస్తున్నట్లు?

శేషగిరి తండ్రి జగన్నాథంగార్ని నానా మాటలన్నాడు. తను కులం, గౌరవం, మర్యాద నాశనం చెయ్యడానికి పూనుకున్నారన్నాడు. పాపం ఎదుటాయన ఏమీ మాట్లాడ్లేదు.

రాత్రికి తను ఇంట్లోనే పండుకున్నాడు. మస్తిష్కం మండుపోతోంది. దొడ్డితలుపు తీసి బయటకి వచ్చాడు. సత్యవతి ఒక్కర్తే వాళ్ళ ఇంటి దొడ్డిగుమ్మంముందు మంచంవేసుకుని పడుకుంది. అదే తెల్లచీర, అదే పూల బ్లాకెట్టు. సత్యవతి లోకంమీద ఎనలేని విరక్తితో శాశ్వతంగా కళ్ళుమూసినట్టు నిశ్చలంగా పండుకుంది. శేషగిరి ఆమె మంచం దగ్గిరగా వెళ్ళి తన ముఖం ఆమె ముఖంమీద పెట్టాడు గాలికి రేగిన జుట్టు తన ముఖాన్ని తడిమింది. ఆమె వేడివిశ్వాసం విశ్వాన్ని లయంచేయడానికి బయలుదేరుతో తనను చుట్టేసింది. ప్రళయానంతరం సముద్రం వదిలిన వేడది. స్వప్న సువాసన రూపందాల్చి నాట్యంచేస్తోంది. శేషగిరికి భయంవేసింది. అతనామెను ముట్టుకో

లేదు అది ఒక తేజస్స్వరూపం! ఆ స్వరూపం తన స్పర్శజ్ఞానానికి అందనిది. దాన్ని చూస్తూ కూర్చోవలసిందే! మెల్లిగా తలుపులుమూసి యింట్లోకి వచ్చాడు. కాని సత్యవతి నిశ్వాసంలోని వేడి తనను ఆవరించేవుంది. ఆమెను తానెక్కడా తాకలేక పోయాడు. ఆమె ఓ అనంతమైన వెలుగు. తన కెక్కడా చెయ్యి అనించడానికి చోటుదొరకదు. అప్పుడతను 'లా' చదివే "గిరి" కాదు. ఎవరో?

రెండో రోజునే నాన్న స్టేషన్‌కి వచ్చి బండెక్కించాడు.

మనస్సేమీ బావుండడంలేదు. తనలో ఏదో ఎందుకో ఘోరంగా యుద్ధం జరుగుతోంది. దైనిక దినచర్య సహితం మారిపోయింది.

నెలరోజులు గడిచిపోయాయి. ఓ రోజు సత్యవతి పెళ్ళి శుభలేఖ వచ్చింది తనకి. అది ఎవరో వేసివుండరు. బహుశా సత్యే వేసివుండాలి! ఆమె నిశ్వాసోజ్జ్వల ఉష్ణంచేత చుట్టబడ్డాడు. ఆ వేడి వున్నకొద్దీ అధికమౌతోంది. జ్వాలగా మారింది. దహించి వేస్తోంది. తనుపట్టి పిరికివాడు. సంఘంక్రింద పెరిగే ఓ క్షుద్రజీవి. తనో గాలికి వంగిపోయే గడ్డిపరక.

శేషగిరి సముద్రతీరాన్ని కూర్చున్నాడు. తను ఒక ఇసుక రేణువు. తనూ దానికిమల్లే చలిస్తున్నాడు. సముద్రపునీరు ఒకసారి ముందుకూ, ఇంకోసారి వెనక్కూ తీసుకుపోతోంది తీరంమీద ఇసుకని. ఉదధి తననిచూచి ఘోరంగా నవ్వుతోంది. ఆ పొంగే కెరటాలు ప్రపంచాన్ని ముంచ వెందుచేతో!

దయాకర్రావువచ్చి ప్రక్కన కూర్చున్నాడు. తన బాధల్ని ఇతరులతోచెప్పి సానుభూతి పొందడం తనకింకా అలవాటులేదు.

"మిత్రరత్నమా - ఈ సంతోష సమయమున సముద్రముచెంత బేలవై...అన్నట్లు బేల స్త్రీలింగమా, పుంల్లింగమా... ఏదైతే ఏంలే. ఎవ్వరూ లేరుగా—ఆఁ బేలవై కూర్చుంటివేల?" అన్నాడు దయాకర్రావు. జీవితంలో దేన్నీ విపరీతంగా తీసుకోడు-హాస్యదృష్టితో జీవితాన్ని చూస్తాడు.

నవ్వడానికి ప్రయత్నం చేశాడు శేషగిరి. ఆ నవ్వులో సారంలేకపోవడం దయాకర్రావు గమనించాడు.

"కొద్దిరోజుల్నుంచీ నీ ధోరణి అదో ఇదిగా వుందిరా" అన్నాడు. "ఆఁ అన్నట్లు ఏదో రిఫరెన్సుకు అవసరమొచ్చి నీ పుస్తకం తీశాను. దాంట్లోనించి ఓ శుభలేఖకూడా క్రిందపడింది. దానిమీద కన్నీళ్ళచుక్కలు చూచాను. ఏమిటీ అంత దీర్ఘంగా బాధపడుతున్నావు?" అన్నాడు దయాకర్రావు. శేషగిరి వాటిని చూళ్ళేదు. అవి తనకళ్లెంట రాలినవో, సత్యవతి కన్నీళ్ళో తనకు తెలీలేదు.

"ఇదుగో గిరీ బాధలు దాచుకోవడంవల్ల ప్రయోజనం శూన్యమోయ్. అవి మనుష్యుల్ని దహిస్తాయి. నువ్వింతిగా ఇదవుతున్న బాధేమిటో కాస్త చెప్పు. దాంట్లో నువ్వింత వ్యథపడాల్సిన అవసరంలేదేమో చూద్దాం" అన్నాడు.

శేషగిరి తలవంచుకొని "నేను ఆమెను కోరాను, ఆమె సౌందర్యాన్ని అనుభవిద్దామనుకున్నాను. కాని ఒకరోజు రాత్రి...ఆమె సుకుమారసౌందర్యం చూచి ఇక చూళ్ళేక కళ్ళు మూతలుపడ్డాయి. నేనామెను చేత్తోగూడా తాకలేకపోయాను. ఆమెను అలాఅనుకొని పొరపాటుపడ్డాననీ, నేను సత్యవతిని ప్రేమిస్తున్నాననీ ఇప్పటికి తెలిసింది. కాని..." గభాల్న వెనక్కి తిరిగి దయాకర్రావుని కావలించుకున్నాడు. ఉదధి పొంగుతోంది. కన్నీరు నిరవధిగా ప్రవహిస్తోంది. ప్రవహించనివ్వవలసిందే! తనలోవున్న ప్రేమ — అనురాగానికి. అంటుకున్న ఈ మలినాల్ని ప్రక్షాళనం చెయ్యవలసిందే! కన్నీటిబొట్లతో తడిచిన ఇసుక సముద్రంచేత ప్రక్షాళితంచేయబడుతుంది. కన్నీటిని కోల్పోయిన కళ్ళు తేజోవిహీనాలయిపోతాయి-అంతకంటె ఇంకేమీ గావు.

దయాకరరావు వీపుతట్టాడు, "అంతే గిరీ! మనకు ప్రేమిస్తున్నామన్న విషయం తెలీదు. అది ఆడవాళ్ళకు తెలుస్తుంది. మనకా విషయం తెలిసేసరికి వాళ్ళాతీరానా-మనం ఈ తీరానా వుంటాం" అన్నాడు. ఉదధి ఇంకా పొంగుతూనే వుంది.